ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 10-02-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

ముఖ్యాంశాలు

- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మహా కుంభమేళాలో ఈరోజు పుణ్యస్నానం ఆచరించారు.
- విద్యార్థుల ఎదుగుదలకు స్వేచ్ఛ అవసరమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉద్ఘాటించారు.
- భారత్ లో ఫైలేరియా వ్యాధిని 2030 నాటికి పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని ఆరోగ్య శాఖా మంత్రి జే.పి. నడ్డా తెలిపారు.
- ఏరో ఇండియా 2025 ఈ రోజు బెంగళూరులోని యలహంక వైమానిక కేంద్రంలో ప్రారంభమైంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రయాగరాజ్ లో జరుగుతున్న మహా కుంభమేళాలో ఈరోజు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పాల్గొని త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానం ఆచరించారు. ముందుగా ప్రయాగ్‌రాజ్ చేరుకున్న రాష్ట్రపతికి ఉత్తర్‌ప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వాగతం పలికారు. తర్వాత వారితో కలిసి ద్రౌపదీ ముర్ము పడవలో ప్రయాణించారు. మార్గమధ్యంలో వలస పక్షులకు రాష్ట్రపతి ఆహారం అందించారు. అనంతరం త్రివేణి సంగమం వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా.. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో కుంభమేళాలో అధికారులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు 'పరీక్షా పే చర్చా' కార్యక్రమాన్ని ప్రతీసంవత్సరం నిర్వహిస్తున్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన 'పరీక్ష పే చర్చా' 8వ సంచికలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ విద్యార్థులతో సంభాషించారు. పరీక్షల సమయంలో ఒత్తిడి, ఆందోళనను ఎలా అధిగమించాలో విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు పుస్తకాలకు పరిమితం కాకూడదని, ఎదుగుదల కోసం వారికి స్వేచ్ఛ అవసరమని ఆయన ఉద్ఘాటించారు. పరీక్షలే సర్వస్వం కాకూడదని, పరీక్షల్లో సత్తా చాటేందుకు విద్యార్థులు తమకు ఇష్టమైన కార్యక్రమాల్లో పాల్గొనాలని అన్నారు. అలాగే ఆరోగ్యంగా వుండేందుకు పోషకాహారంతో పాటు, తగినంత నిద్ర అవసరమని ప్రధానమంత్రి పేర్కొంటూ..

(వాయిస్...30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఫైలేరియా నిర్మూలన కోసం మరో విడత జాతీయ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమాన్ని కేంద్ర ఆరోగ్య మంత్రి జె పి నడ్డా ఈ రోజు ప్రారంభించారు. ఫైలేరియా వ్యాధి బారి నుండి లక్షల మందిని రక్షించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ రోజు నుంచి 111 స్థానిక జిల్లాల్లోని 17.5 కోట్ల జనాభాకు ఉచితంగా ఫైలేరియా మందులు అందుబాటులో వుంటాయని తెలిపారు. ఫైలేరియాను 2030 నాటికి నిర్మూలించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బెంగళూరులోని యలహంక వైమానిక కేంద్రంలో ఏరో ఇండియా 2025 ఈ రోజు ప్రారంభమైంది. ఈ నెల 14వ తేదీ వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుంది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ, ఏరో ఇండియా, వికాస్ భీ.. విరాసత్ భీ అన్న ప్రధానమంత్రి నినాదానికి అనుగుణంగా ఉందని పేర్కొన్నారు. గత ఏరో ఇండియా నుంచి ఇప్పటివరకు న్యూజనరేషన్ ఆకాశ్ మిసైల్, అండర్ వాటర్

అటానమస్ వెహికల్, అన్‌మ్యాన్డ్ సర్ఫేస్ వెస్సెల్ పై పురోగతి సాధించామని అన్నారు. భవిష్యత్తులో మరింత వేగంగా ముందుకు వెళతామని పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో 27 దేశాల రక్షణ మంత్రులు, 15 దేశాల రక్షణ, సేవారంగాల అధికారులు, 12 దేశాల రక్షణశాఖ కార్యదర్శులు పాల్గొన్నారు. మొత్తం 80 దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ వేదిక నుంచి తమ రక్షణ ఉత్పత్తులను ప్రదర్శిస్తారని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మాఘ పూర్ణిమ నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్ రైల్వేస్టేషన్ లో ఏర్పాట్లను ఈరోజు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ పరిశీలించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ, మహా కుంభ్ కోసం నగరంలోని ఎనిమిది రైల్వే స్టేషన్లలో ప్రభుత్వం విస్తృతమైన ఏర్పాట్లు చేసిందని చెప్పారు. భక్తుల కోసం రైల్వే స్టేషన్‌లో అన్ని ఏర్పాట్లను రూపొందించడానికి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తోందని ఆయన తెలిపారు. ప్రయాగ్‌రాజ్ సంగం స్టేషన్‌ను ఈ నెల 14 వరకు ప్రయాణికుల రాకపోకల కోసం మూసివేస్తున్నామని తెలిపారు. మహాకుంభమేళా ప్రాంతం చుట్టూ ఉన్న ఇతర ఎనిమిది స్టేషన్ల నుండి సాధారణ, ప్రత్యేక రైళ్లు సజావుగా నడుస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహిళల ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోందని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖా మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా అన్నారు. ఈరోజు లోక్‌సభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇస్తూ, మహిళల కోసం ప్రభుత్వం అనేక చట్టాలను రూపొందించిందని అన్నారు. మహిళా కార్మికుల భద్రత కోసం సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు యజమాన్యాలకు మార్గదర్శకాలు ఇచ్చామని తెలిపారు. శక్తి, డ్రోన్ దీదీ, లఖపతి దీదీ పథకాలు మహిళల ఉపాధిని మెరుగుపరచడం కోసం జాతీయ, ప్రాంతీయ వృత్తి శిక్షణా సంస్థలలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహా కుంభమేళాలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. మధ్యప్రదేశ్ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లే పలు మార్గాల్లో భారీగా వాహనాలు నిలిచిపోవడంతో రాబోయే రెండు రోజులపాటు ప్రయాగ్‌రాజ్ వైపు వెళ్లొద్దని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ యాత్రికులకు సూచించారు. ట్రాఫిక్ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ముందుకు సాగాలన్నారు. ప్రయాగ్‌రాజ్‌కు భారీ సంఖ్యలో తరలిరావడం శుభపరిణామమే అయినప్పటికీ వారి సురక్షిత ప్రయాణం, భద్రతపై ఆందోళన చెందుతున్నామన్నారు. ఈ మార్గాల్లో ప్రయాణించే వారికి నీరు, ఆహారంతో పాటు ఇతర అత్యవసర సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని, స్వచ్ఛంద సంస్థలు కూడా దీనికి సహకరిస్తున్నాయని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

స్వచ్ఛ్ భారత్ కార్యక్రమం కింద గ్రామీణ ప్రాంతాల్లో 12 కోట్ల మరుగుదొడ్లను నిర్మించామని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ తెలిపారు. పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో రాజ్యసభలో ఈరోజు ఆయన ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి సమాధానమిస్తూ, 7 కోట్ల మంది ప్రజలకు మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పించామన్నారు. ఈ క్రమంలో పిల్లలు రక్షించబడ్డారని, గ్రామీణ మహిళల ఆరోగ్యం మెరుగుపడిందన్నారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో మరుగుదొడ్ల కోసం వాటర్ ట్యాంక్‌ను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలతో ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. 5 లక్షలకు పైగా గ్రామాలు బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా మారాయని మంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నైపుణ్య అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖా మంత్రి జయంత్ చౌదరి అన్నారు. లోకసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఈరోజు ఆయన సమాధానమిస్తూ, పాఠశాలల నుండి ప్రారంభమయ్యే నైపుణ్యం కోసం పర్యావరణ వ్యవస్థను రూపొందించడం లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. స్వదేశీ నైపుణ్యాభివృద్ధి సంస్థల స్థాపనలో అనేక రాష్ట్రాలు ముందుకు సాగుతున్నాయని, అటువంటి సంస్థల ఏర్పాటుకు కేంద్ర పథకం లేదని ఆయన పేర్కొన్నారు. అయితే, అనేక ఇతర పథకాల కింద, విశ్వసనీయమైన ఏ సంస్థకైనా ఇది తోడ్పాటును అందించగలదని మంత్రి తెలియజేశారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన వంటి పథకాల ద్వారా గిరిజన సంఘాలు, అనేక ఇతర తరగతుల నైపుణ్యాలను మెరుగుపరచడంలో ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి వివరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో వరుసగా నాలుగోరోజు మార్కెట్లు నష్టాన్ని చవిచూశాయి. స్టీల్, అల్యూమినియం దిగుమతులపై 25 శాతం సుంకాలు విధిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రతికూల ప్రభావం చూపాయి. ఈ క్రమంలో సెన్సెక్స్ 700 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ 23,400 దిగువకు చేరింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.49గా స్థిరపడింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 75.36 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2929 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా వీలైనన్ని ఎక్కువ విమానాశ్రయాలను నిర్మించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పౌరవిమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈరోజు రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన సమాధానమిస్తూ, మధ్యతరగతి, దిగువ తరగతి సమాజం విమాన ప్రయాణం కోసం ఆకాంక్షించేలా విమాన ప్రయాణ వ్యవస్థను నిర్మిస్తామని తెలిపారు. డిమాండ్ ఆధారిత మార్కెట్‌పై ఆధారపడి విమాన ఛార్జీల పెంపు ఉంటుందని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =